క్లుప్తంగా

కమ్యూనిటీ స్థలం ఆక్రమించారంటూ ఫిర్యాదు


గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

మార్టూరు: అంబేడ్కర్ భవన నిర్మాణం కోసం నాలుగు దశాబ్దాల క్రితం కేటాయించబడిన కమ్యూనిటీ స్థలాన్ని స్థానికులు ఆక్రమిస్తున్నారని మార్టూరుకు చెందిన వ్యక్తులు జిల్లా గ్రీవెన్స్ సెల్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. స్థానిక రామనగర్, నేతాజీ నగర్ కాలనీలు నాలుగున్నర దశాబ్దాల క్రితం ఏర్పడగా ప్రభుత్వం రెండు కాలనీల మధ్య అంబేడ్కర్ భవన నిర్మాణం కోసం అప్పట్లో 10 సెంట్ల భూమిని కేటాయించారు. అందులో భవన నిర్మాణం సైతం స్థానికులు జరిపారు. అంబేడ్కర్ భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణం కోసం పాత భవనాన్ని కూల్చి వేశారు. ఈ క్రమంలో సమీపంలో గుంటూరు శంకరరావు అనే వ్యక్తి తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో స్థలాన్ని ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని అధికారులు విచారించి తగు చర్యలు తీసుకోవాలని నేతాజీనగర్, రామనగర్ కాలనీల తరఫున గొట్టిపాటి దేవనిదయ తదితరులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు.

ముక్తేశ్వరస్వామి వారిని దర్శించుకున్న జడ్జి


జూనియర్ సివిల్ జడ్జి హరీష్‌బాబును ఆశీర్వదిస్తున్న పూజారి

జే.పంగులూరు: మండల పరిధిలోని రేణింగవరం గ్రామంలో భ్రమరాంబ సమేత ముక్తేశ్వర స్వామి వారిని సోమవారం నల్గొండ జిల్లా దేవరకొండ జూనియర్ సివిల్ జడ్జి కేవీఎస్ హరీష్‌బాబు దర్శించుకున్నారు. ఆలయంలో అమ్మవారికి పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు హరీష్ బాబుకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు. మండల పరిధిలోని కశ్యాపురం బంధులు ఇంటి వద్దకు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నట్లు తెలియజేశారు.

బైబిల్ పఠనంతో సన్మార్గం


పరీక్ష ప్రశ్న పత్రాలను ఆవిష్కరిస్తున్న సుబ్బారావు

చినగంజాం: బైబిల్ పఠనంతో యువత సన్మార్గంలో నడిచి దేవుడు, సమాజంపై బాధ్యతగా జీవించాలని ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు వైద్యులు కట్టిబోయిన సుబ్బారావు అన్నారు. క్రిస్మస్ సందర్భంగా చినగంజాం అంబేడ్కర్ నగర్‌లోని పెద్ద చర్చి వద్ద సోమవారం బైబిల్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బైబిల్ పరీక్ష ప్రశ్న పత్రాలు ఆవిష్కరించారు. పరీక్షలో 25 మంది పాల్గొన్నారు. క్రిస్మస్ క్యారల్స్ నిర్వాహకుడు మేకల మేషక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయుడికి లక్ష తమలపాకుల పూజ


తమలపాకుల పూజలో ప్రసన్నాంజనేయస్వామి

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి వారికి కార్తీకమాసం పౌర్ణమి సందర్భంగా సోమవారం లక్ష తమలపాకులతో పూజ ఘనంగా నిర్వహించారు. ప్రాతః కాలంలో స్వామివారికి సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం నిర్వహించారు. అనంతరం అభిషేక కార్యక్రమం నిర్వహించి అలంకరించారు. వేదపండితులు, అర్చకులు, ఉభయదాతలు వేదస్వస్తి మంగళవాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణ, వినాయకస్వామివారికి, సుబ్రమణ్య స్వామి స్వామివారికి జీవధ్వజ ఉష్ట్ర వాహనానికి నారికేళం సమర్పించారు. గణపతి పుణ్యాహవచనం అనంతరం 11 ఆవృత్తాలుగా దేవస్థాన వేదపండితులు లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. కార్యక్రమానికి కొరిశపాడు మండలం కుర్రవానిపాలెం గ్రామానికి చెందిన నాదెండ్ల కోటేశ్వరరావు, దంపతులు పాల్గొన్నారు. దేవస్థాన కార్యనిర్వాహణ అధికారి టి. సుభద్ర పర్యవేక్షించారు.

బీఎస్ఎల్ఎఫ్ జిల్లా కన్వీనర్‌గా విశ్వేశ్వరరావు


విశ్వేశ్వరరావు

చీరాల రూరల్: బహుజన్ సమాజ్ పార్టీ లాయర్స్ ఫోరమ్ బాపట్ల జిల్లా కన్వీనర్‌గా చీరాల కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వర్తిస్తున్న అందె విశ్వేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు గుంటూరులో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి బహుజన లాయర్స్ ఫోరమ్ సమావేశంలో రిటైర్డు న్యాయమూర్తి గురప్ప, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి సమక్షంలో జిల్లా కన్వీనర్‌గా తనకు బాధ్యతలు అప్పగించినట్లు న్యాయవాది విశ్వేశ్వరరావు తెలిపారు.


వాడరేవు సముద్ర తీరంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు


వేటపాలెం తీరం వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు


పర్యాటకులతో పోటెత్తిన వాడరేవు తీరం

కార్తిక దీపం సకల పాపహరణం

- సముద్ర తీరాలకు పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన ఆలయాలు
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు

చీరాల టౌన్/చీరాల అర్బన్/వేటపాలెం: కార్తీక మాసంలో పౌర్ణమి సముద్ర స్నానాలకు ప్రత్యేక ఉంది. కేదారేశ్వరస్వామి వ్రతాలు నోచుకునే వారు, పరమశివుడిని భక్తిశ్రద్ధలతో కొలిచే భక్తులు విధిగా పౌర్ణమి స్నానాలు చేస్తుంటారు. సోమవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని చీరాల వాడరేవు సముద్ర తీర ప్రాంతాల్లో ప్రజలు పుణ్యస్నానాలు ఆచరించి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. చీరాల వాడరేవు తీర ప్రాంతానికి అద్దంకి, పర్చూరు, చిలకలూరిపేట, నర్సరావుపేట, సత్తెనపల్లి తదితర నియోజకవర్గాల నుంచి భక్తులు ద్విచక్రవాహనాలు, కార్లు, ట్రాక్టర్లు, ఆటోల్లో వాడరేవుకు వచ్చారు. సముద్రపు ఒడ్డున ఇసుకతో శివలింగాలను తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీరం ఒడ్డున ఉన్న ఆంజనేయ స్వామితో పాటుగా గ్రామంలోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ ప్రసాదరావు, శిక్షణ డీఎస్పీ విద్యశ్రీ పర్యవేక్షణలో సీఐలు సోమశేఖర్, శేషగిరిరావు, రూరల్ ఎస్సై జనార్దన్, మెరైన్ ఎస్సై పసుపులేటి సుబ్బారావు, ఎస్సై అహ్మద్‌జాని, ఏఆర్, సివిల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రూరల్ స్టేషన్ ఆధ్వర్యంలో పోలీస్ అవుట్‌పోస్టుతో పాటుగా గజ ఈతగాళ్లతో ప్రత్యేక చర్యలు చేపట్టారు.

■ చీరాల, పేరాలలోని శివాలయాలు, మదనగోపాలస్వామి దేవాలయ ఆవరణలో కార్తీక దీపాలను వెలిగించారు. పేరాల శివాలయంలోని రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి జీవీఎల్ కుమార్ భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.


పంగులూరులో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న స్వామివారు


విశేష అలంకరణలో గన్నవరం కాశీవిశ్వేశ్వరస్వామి


మణికేశ్వరంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

■ వేటపాలెం తీరప్రాంతాలైన పొట్టి సుబ్బయ్యపాలెం, కఠారివారిపాలెం, రామచంద్రాపురం, రామాపురం సముద్ర తీరాల్లో భక్తులు అధిక సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించారు. శివునికి అత్యంత ప్రీతి పాత్రమైన రోజు భక్తులు కార్తీక నోములు నోచుకోని మొక్కులు తీర్చుకొన్నారు. సత్య న్నారాయణస్వామి వ్రతాలు ఆచరించిన వారికి అంతా మంచి చేకూరుతుందని విశ్వాసం.

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు..

కారంచేడు/మార్టూరు/చినగంజాం/యద్దనపూడి: పవిత్ర కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని వివిధ దేవాలయాల్లో కార్తీక దీపోత్సవ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే చెరువులు, బావుల వద్ద చన్నీటి స్నానమాచరించి ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. పూనూరులోని త్రిపురాంతకస్వామి, గన్నవరం కాశీవిశ్వేశ్వరస్వామి, యద్దనపూడి రామలింగేశ్వరస్వామి, వెంకటేశ్వరస్వామి, ఆలయాల్లో స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అర్చనలు, నిర్వహించారు.

■ మండలంలోని పల్లెపాలెం పంచాయతీ బాపయ్య నగర్, మోటుపల్లి పంచాయతీ మోటుపల్లి వాడరేవు, పెదగంజాం పంచాయతీ పల్లెపాలెం వాడరేవు నందు భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. మండలంలోని గ్రామాలతో పాటు ఇంకొల్లు, పంగులూరు, నాగులుప్పలపాడు మండలాల నుంచి భక్తులు సముద్ర స్నానమాచరించేందుకు తరలి వచ్చారు. సముద్ర స్నానాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఎస్సై కే సురేష్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి..

అద్దంకి/అద్దంకి రూరల్/బల్లికురవ/జే.పంగులూరు/మేదరమెట్ల: కార్తీక మాసంలో పౌర్ణమి రోజున ఉపవాసం ఉండి శివాలయంలో దీపం వెలిగించి, శివుని దర్శనం చేసుకుంటే పాపాలు పోతాయని బక్తుల నమ్మకం. దాంతో సోమవారంతో కలిసిన కార్తీక పౌర్ణ రావడంతో పట్టణంలోని రామలింగేశ్వర, నగరేశ్వర, కమలేశ్వర, దాత్తాత్రేయ ఆలయాలు, మండలంలోని పురాత శివాలయం తిమ్మాయపాలెం, బొమ్మనంపాడు, వేలమూరిపాడు గ్రామాలతోపాటు వివిధ గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దక్షిణా కాశీగా పేరు గాంచిన మణికేశ్వరంలోని మల్లీశ్వర స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారి కుంకుమాభిషేకం, అయ్యవారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

కృష్ణచైతన్య ప్రత్యేక పూజలు..

మల్లేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అద్దంకి మండల పార్టీ అధ్యక్షుడు గుజ్జుల జగన్ మోహన్‌రెడ్డి అద్దంకి పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేషన్ డైరెక్టర్‌లు, సొసైటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

■ జే.పంగులూరు మండల పరిధిలోని పంగులూరు భీమలింగేశ్వరస్వామి వారి దేవాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. స్వామి వారిని భక్తులు పంచామృత విశేష ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. స్వామి వారికి ఆలయ ప్రాంగణంలో భక్తులు 365 ఒత్తులు, లక్ష ఒత్తులు వెలిగించి స్వామి వారి ప్రసాదాలు స్వీకరించారు.

■ బల్లికురవ మండలం చిన అంబడిపూడి, గంగా పార్వతిదేవి సమేత మల్లేశ్వరస్వామి, చెన్నుపల్లి గంగాపార్వతీ సమేత పరుసవేదిశ్వరస్వామి, కొనిదెన భవాని సమేత శంకరస్వామి, కొండాయపాలెం గంగాపార్వతి సమేత నీల కంఠేశ్వరస్వామి, కొప్పెరపాడు, కొమ్మినేనివారిపాలెం, వైదన, గుంటుపల్లి, నక్కబొక్కలపాడు, గ్రామాల్లో శివాలయాల్లో ఉదయం 5 గంటల నుంచి భక్తులు దీపాలు వెలిగించారు. శివునికి పంచామృతాలతో అభిషేకం, అమ్మవార్లకు కుంకుమ పూజలు చేపట్టారు.


మణికేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


చినఅంబడిపూడి శివాలయంల్లో వత్తులు వెలిగిస్తున్న భక్తులు


వాడరేవులో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న పోలీసులు

రానున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణచైతన్య

- శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

మేదరమెట్ల: రానున్న ఎన్నికల్లో మళ్లీ గెలిచేది వైఎస్సార్ సీపీనే అని శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామంలో నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మూడో రోజైన సోమవారం కార్యక్రమంలో చైతన్య పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లిన ఆయనకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేస్తూ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాత అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలను అందజేశారని చెప్పారు. గత ప్రభుత్వంలో మాదిరిగా జన్మభూమి కమిటీలు, సిఫార్సులు, లంచాలు వంటివి లేకుండా నేరుగా ఇంటి ముంగిటకే పథకాల లబ్ధి అందుతుందన్నారు. కార్యక్రమంలో మండల, గ్రామ నాయకులు, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 51 మంది ఎంపిక


నియామక పత్రాలు అందుకుంటున్న అభ్యర్థులు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులోని వీఎస్ఆర్ అండ్ ఏఎం డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో 51 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు బాపట్ల జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీ తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా ఉపాధి కార్యాలయంలో ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు 125 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. వీరిలో 51 మందిని పలు కంపెనీల ప్రతినిధులు తమ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రావి అంకమ్మచౌదరి, యంగ్ ప్రొఫెషనల్ హారికా సౌగంధి, రవికిరణ్, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సముద్ర స్నాన భక్తులకు అల్పాహారం

చినగంజాం: కార్తీక పౌర్ణమి సందర్భంగా సముద్రంలో పవిత్ర పుణ్య స్నానాలు చేసేందుకు వచ్చిన భక్తులకు దాతలు సోమవారం అల్పాహారం పంపిణీ చేశారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అల్పాహారాన్ని ఉపాధ్యాయుడు సిద్ధం నాగమల్లేశ్వరరావు, సంకె శ్రీను ఆధ్వర్యంలో భక్తులకు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అల్పాహారం స్వీకరించారు. కార్యక్రమంలో సంకె నాగరాజు, దండుప్రోలు నారాయణ పాల్గొన్నారు.



భక్తులకు అల్పాహారం అందజేస్తున్న దాతలు

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం, కార్తీక మాసం, రోహిణి నక్షత్రం, పౌర్ణమి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్ర ప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకుపూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అయ్యప్ప మాలధారులకు భిక్ష


భిక్ష తీసుకుంటున్న అయ్యప్ప మాలధారులు

అద్దంకి: మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలోని గంగాపార్వతీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో అయ్యప్ప పీఠం ఏర్పాటు చేశారు. పుట్టంరాజు శ్రీనివాసరావు గురుస్వామి ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా పీఠం వద్దనున్న అయ్యప్ప విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలోని భక్తులు అయ్యప్పకు పంచామృతాలను భక్తితో సమర్పించుకున్నారు. అనంతరం ఆలయంలో పడి భజనా కార్యక్రమాన్ని నిర్వహించి దీక్షాపరులతోపాటు హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు, భిక్ష పెట్టారు. కార్యక్రమంలో పీఠంలోని అయ్యప్ప దీక్షా పరులు పాల్గొన్నారు.

స్పందనతో సమస్యల పరిష్కారం

చీరాల టౌన్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు స్పందన చక్కటి వేదిక అని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. స్పందన కార్యక్రమాన్ని సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. పలుశాఖల అధికారులతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలను తహశీల్దార్‌కు అందించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు ఉన్న రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల సమస్యలను అర్జీల ద్వారా అందిస్తే సత్వరమే వాటికి పరిష్కారం చూపుతామన్నారు. స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన సచివాలయాలు, మండల తహశీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం అర్జీల స్వీకరణ జరుగుతుందన్నారు. స్పందన కార్యక్రమంలో వివిధ రకాల సమస్యలపై ప్రజలు 11 అర్జీలను అందించారు. హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, సర్వేయర్ రామాంజనేయులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

హరిబాబు సేవలు ప్రశంసనీయం

బల్లికురవ: నాలుగు దశాబ్దాలుగా ఎందరో విద్యార్థులను తీర్చి దిద్దిన తాతా హరిబాబు సేవలు ప్రసంశనీయమని పలు మండలాల ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు స్థానిక నేతలు కొనియాడారు. మండలంలోని కొమ్మినేనివారిపాలెం ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తూ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేయగా సోమవారం పాఠశాలలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సభలో బల్లికురవ, అద్దంకి, ముండ్లమూరు, ఇంకోల్లు మండలాల ఎంఈవోలు కె. రమేష్‌బాబు, గంగాధర్, సుధాకర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ఎస్‌జీటీ, ఎల్ఎఫ్ఎల్ మెర్జమ్ గజిటెడ్ హెచ్ఎంగా పాఠశాలలు, విద్యాభివృద్ధికి కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో భాగంగా హరిబాబు దంపతులను దుశ్శాలువాలతో సత్కరించారు. స్థానిక నేతలు చింతల శ్రీనివాసరావు, ఎం రామారావు పాల్గొన్నారు.


తాతాహరిబాబు దంపతులను సన్మానిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

మళ్లీ సీఎం జగనన్నే కావాలంటూ పాదయాత్ర

మార్టూరు: ఏపీకి సీఎంగా వైఎస్ జగన్ మోహనరెడ్డి రెండోసారి ఎన్నిక కావాలంటూ వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి తమ బృందంతో తిరుమలకు పాదయాత్రకు బయలుదేరాడు. టెక్కలికి చెందిన గడ్డిబోయిన గురునాథ్ యాదవ్ 2024లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి ఎన్నిక కావాలంటూ తన మొక్కు తీర్చుకోవటం కోసం తిరుమలకు కాలినడకన బయలుదేరాడు. ఈ నెల 8వ తేదీ టెక్కలి నుంచి తన ఐదుగురు మిత్రులతో బయలు దేరిన గురునాథ్ 20 రోజులపాటు ప్రయాణించి సోమవారం రాత్రి మండలంలోని కోనంకి గ్రామంలో బసచేసి విలేకరులతో మాట్లాడారు. వలపర్ల గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు కారంపూడి కోటినాగులు, దామెర్ల శ్రీను తదితరులు గురునాథ్ యాదవ్ బృందానికి ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.



కాలినడకన వెళ్తున్న గురునాథ్ యాదవ్ బృందం

యూత్ కమ్యూనిటీ క్రిస్మస్ పోటీలు


బహుమతులు అందుకుంటున్న యూత్ సభ్యులు

చీరాల రూరల్: స్థానిక బేర్‌పేట లూథరన్ చర్చిలో 29వ యూత్ కమ్యూనిటీ క్రిస్మస్ కాంపిటేషన్స్ ఆదివారం రాత్రి ఎంతో ఘనంగా నిర్వహించారు. ముందుగా సంఘకాపరి కె. జాన్ ఆల్ఫ్రెడ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఒన్‌టౌన్ సీఐ శేషగిరిరావు పాల్గొని యువతీ, యువకులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత ఆధునికీకరణ యుగంలో యువత చెడునడత విడనాడి సన్మార్గంలో నడవాలని సూచించారు. ముఖ్యంగా సెల్‌ఫోన్లు, ఇంటర్‌నెట్, టీవీలు, సినిమాల వంటివాటిపై దృష్టి నిలపకుండా చక్కగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీసీసీ, ఎల్‌సీసీ, ట్రెజరర్ పాల్గొన్నారు.

సంతనూతలపాడులో రెడ్‌క్రాస్ సొసైటీ ఏర్పాటు

చీమకుర్తి: కలెక్టర్ ఆదేశాల మేరకు సంతనూతలపాడు మండలంలో రెడ్‌క్రాస్ సొసైటీని ఏర్పాటు చేస్తున్నట్లు సంతనూతలపాడు తహసీల్దార్ పీ మధుసూదన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీకి జిల్లా స్థాయిలో కలెక్టర్, మండల స్థాయిలో తహశీల్దార్ అధ్యక్షుడిగా కొనసాగుతారన్నారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న రెడ్‌క్రాస్ సొసైటీకి చైర్మన్, వైస్ చైర్మన్లను ఈ నెల 17న మొదటి సమావేశంలో ఎన్నుకుంటారని చెప్పారు. సొసైటీలో జీవితకాల సభ్యులుగా చేరేవారంతా ఈ నెల 17న సంతనూతలపాడులోని సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయ ఆవరణలో నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని ఆయన సూచించారు.

పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలి

చీరాల టౌన్: గ్రామ పంచాయతీలను అభివృద్ధిలో ముందంజలో ఉంచాలని ఎంపీడీవో కే నేతాజీ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ సచివాలయాలను తనిఖీలు చేసి పెండింగ్ అర్జీలను విచారించినట్లు తెలిపారు. ప్రజలు వచ్చిన అర్జీలను నిశితంగా విచారించి అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సాయం అందించేలా చూడాలన్నారు.